# నీడ నిజం

ఆ ఎదురింట్లో చెట్టు చూడు
పొరుగింట్లో చెట్టు కూడా చూడు
ఎలా విరగ బూస్తుందో
ఎన్ని కాయలు కాస్తుందో
ఎంత మందికి హాయి నిస్తుందో – నీడ నిస్తుందో
ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు
ఎంత కావాలనుకుంటే అంత
ఇలా ఊపుతే చాలు అలా ఫలాల్ని రాలుస్తుంది
మన చెట్టూ ఉంది
పనికి మాలినది పసలేనిది
అంతంత మాత్రం తప్ప అదనంగా కాయనిది
దీనిమీద ఆధారపడటం మన ప్రారబ్ధం
ఏమి చేస్తాం?
జీవితాంతం ఇంక ఇలాగేనేమో!
శాంతి సుఖాలింక లేనేలేవేమో!
ఇది ఉన్నా ఒకటే లేక పోయినా ఒకటే
అసంతృప్తి ఒళ్లంతా నింపుకుని
అలసత్వం ఒళ్లంతా కప్పుకుని
రోజుల్ని ఏదోలా విదిల్చి కొడుతూనే ఉంటాయి
చెట్టు నీడని కసురుతూనే ఉంటాయి
హఠాత్తుగా ఏదో ఒక రోజు
చివికి చివికిన గాలి వానకో
తట్టుకోలేని తుఫాను తాకిడికో
మోస్తున్న బరువు బాధకో
నిలువెత్తు చెట్టు నేల కొరిగినప్పుడు
గుండెలు బాదుకుంటూ

నీడను కోల్పోయిన అనుభవం నిజాలు కక్కుతుంది

తినటానికి ఇంత తిండన్నా పెట్టేది
ఒళ్లొంచకుండా రోజులూ గడిచేవి
ఇంక అదీ లేదు . . .